సాక్షి
చిత్తూరు
గురువారం । 5 । జూన్ । 2025



పకడ్బందీగా బదిలీలు

టీచర్ల బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ పకడ్బందీగా చేపట్టినట్లు ఆర్జేడీ శ్యాముల్ పేర్కొన్నారు. - 12లో



బాధ్యతగా విధులు నిర్వహించాలి

పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులు బాధ్యతగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. - 12లో



గిరిజనులకు జీవనోపాధి

గిరిజనులకు జీవనోపాధి కల్పించేందుకు కసరత్తు చేపడుతున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి తెలిపారు. - 12లో

నిరసన హోరు



పుంగనూరు : నిరసన ర్యాలీలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

జిల్లాలో వెన్నుపోటు దినాన్ని వైఎస్సార్‌సీపీ శ్రేణులు నిరసనలతో బుధవారం జిల్లా , నియోజకవర్గ కేంద్రాల్లో కదం తొక్కారు. పోలీసుల బెదిరింపులు, హెచ్చరికలు, నిషేధాలు పక్కనపెట్టి హామీలు అమలు చేయాలని కార్యకర్తలు గర్జించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపుతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు జెండాలతో దండులా కదిలివచ్చింది. ఎక్కడికక్కడ బారికేడ్లను ఛేదించుకొని నిరసనలకు కదిలివచ్చారు. ఉవ్వెత్తున కార్యకర్తలు తరలిరావడంతో ఆయా ప్రాంతాల్లో నిరసన హోరుతో దద్దరిల్లింది.

- వెన్నుపోటు దినంలో కదంతొక్కిన కార్యకర్తలు
- ఊరూరా కదలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- హామీల అమలు కోరుతూ నినదించిన నేతలు
- కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడ్డ పెద్దిరెడ్డి
- జనంలో వ్యతిరేకత మొదలైందన్న రోజా.. నారాయణస్వామి
- మండు టెండలను లెక్కచేయక కదిలిన జగనన్న సైన్యం



నగరి : వెన్నుపోటు దినం నిరసన ర్యాలీలో చెవిలో పూలు పెట్టుకొని వైఎస్సార్‌సీపీ శ్రేణులతో మాజీ మంత్రి ఆర్కే రోజా

చిత్తూరు అర్బన్ : హామీల పేరిట ప్రజలను దగా చేసి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం వెన్నులో వణుకు పుట్టేలా వెన్నుపోటు దినం నిర్వహించారు. మండు టెండను లెక్కచేయని జగనన్న సైన్యం రోడ్డెక్కి కూటమి సర్కారు మోసాన్ని ఎండగట్టింది. వేల మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ప్రజలు చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలను ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుతో బుధవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన వెన్నుపోటు దినంతో ఎక్కడికక్కడ నిరసనలు వ్యక్తం చేసి హామీల అమలుపై ప్రభుత్వ తీరును తూర్పారబట్టింది.

- చిత్తూరులో జరిగిన నిరసనలో సమన్వయకర్త విజయానందరెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలివచ్చారు. అమూల్ డెయిరీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. పోలీసుల ఆంక్షలను ఏమాత్రం లెక్కచేయలేదు. పార్లమెంటు పరిశీలకులు చువ్వా రాజశేఖర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, నాయకులు కెపి.శ్రీధర్, జగదీష్, గాయత్రీదేవి, లీనారెడ్డి, సూర్యప్రకాష్ రెడ్డి, విజయసింహారెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.
- పుంగనూరులో జరిగిన నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి, స్థానిక శాసన సభ్యుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్వయంగా హాజరు కావడంతో పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు వెన్నుపోటు దినంలో కదంతొక్కారు. పాత బస్టాండు, పోలీస్ స్టేషన్, గోకుల్ సర్కిల్, అంబేడ్కర్ కూడలి వరకు నిరసన కార్యక్రమం నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రెడ్డెప్ప, నాయకులు పెద్దిరెడ్డి, ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి , అనూషారెడ్డి, పోకల అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. నగరిలో మాజీ మంత్రి రోజా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అలాగే గంగాధర నెల్లూరులో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులకు నిరసనకు దిగారు. ఈకార్యక్రమంలో సమన్వయకర్త కృపాలక్ష్మి, మండల కన్వీనర్లు పాల్గొన్నారు. అలాగే కుప్పంలో ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో వెన్నుపోటు నిరసనలకు కదం తొక్కారు. ఇక పలమనేరులో సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ , జెడ్పీ చైర్‌పర్సన్ శ్రీనివాసులుతో కలిసి పలమనేరు సెంటర్‌లో వెన్నుపోటు నిరసన కార్యక్రమం హోరెత్తించారు. రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి, మండల కన్వీనర్లు పాల్గొన్నారు. పూతలపట్టులో మాజీ ఎమ్మెల్యే డా.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో బంగారుపాళ్యం తహసీల్దార్ కార్యాలయం వద్ద వెన్నుపోటు దినం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, పార్టీ నేతలు కుమార్‌రాజా, ధనంజయరెడ్డి, బుజ్జిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోసమే బాబు నైజం



ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు హామీలివ్వడం, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా మోసగించడం చంద్రబాబు నైజం. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగభృతి, ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఏడాది అవుతున్నా ఇచ్చిన దాఖలాలు లేవు.

– రాజశేఖర్‌రెడ్డి, చిత్తూరు పార్లమెంట్ పరిశీలకులు



చిత్తూరు : నిరసన ర్యాలీలో విజయానందరెడ్డి, పరిశీలకులు రాజశేఖరరెడ్డి



కుప్పంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలతో ఎమ్మెల్సీ భరత్



పూతలపట్టు : నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్



పలమనేరు : ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్



పుంగనూరులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పెద్దిరెడ్డి



జీడీ నెల్లూరు : నిరసనలో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

న్యూస్‌రీల్

చిత్తూరులో పోలీసుల ఓవరాక్షన్



చిత్తూరులో నగర అధ్యక్షుడు శ్రీధర్ నుంచి ప్లకార్డు లాగేసుకున్న పోలీసులు

చిత్తూరు అర్బన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన వెన్నుపోటు దినంను అడ్డుకోవాలనే అధికార పార్టీ నేతల సూచనలను చిత్తూరు పోలీసులు అడుగడుగునా అమలు చేశారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారు జాము 4 గంటల వరకు వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లకు వెళ్లి నిద్రపోతున్న వారిని లేపి.. నోటీసులు జారీ చేశారు. ర్యాలీగా వెళ్లకూడదని, పోలీస్ 30–యాక్టు అమల్లో ఉందని, నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇక చిత్తూరులో జరుగుతున్న నిరసన కార్యక్రమానికి వస్తున్న పార్టీ కార్యకర్తలను ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. ద్విచక్రవాహనాలను పీవీకేఎన్ కళాశాల వద్ద ఆపేయడంతో చాలా మంది ఎండలోనే నడుచుకుంటూ కలెక్టరేట్ కూడలి వరకు వచ్చారు. ఇక పుత్తూరు రోడ్డు, గిరింపేట, సంతపేట, కట్టమంచి ప్రాంతాల్లో స్కూటర్లలో కార్యక్రమానికి వస్తున్న కార్యకర్తలను అడ్డుకుని, పలుచోట్ల బైక్ తాళాలు లాక్కున్నారు. ప్రభుత్వ హామీలు అమలు చేయాలనే ప్లకార్డులను పోలీసులు బలవంతంగా లాగేసుకున్నారు. ఎవరైనా ప్లకార్డులు ప్రదర్శిస్తే కేసులు పెడతామని, రౌడీషీట్ తెరుస్తామని హెచ్చరించారు. దీనిపై నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి మాట్లాడుతూ.. చిత్తూరు వన్‌టౌన్ సీఐలు మహేశ్వర, నెట్టికంటయ్య టీడీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని, బెదిరింపులతో ప్రజా ఉద్యమాన్ని ఆపలేరని హెచ్చరించారు.

6 నుంచి 30 వరకు డీఎస్సీ పరీక్షలు

– చిత్తూరులో 04, చెన్నైలో 4 పరీక్ష కేంద్రాలు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తమిళనాడు రాష్ట్రం చెన్నైలో ఈనెల 6వ తేదీ నుంచి 30వ తేదీ వరకు డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో వరలక్ష్మి వెల్లడించారు. బుధవారం ఆమె విలేకరులకు పలు అంశాలు తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జారీ చేసిన షెడ్యూల్ మేరకు రెండు సెషన్స్‌లో డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పరీక్షలకు చిత్తూరు జిల్లాలో 04, తమిళనాడు రాష్ట్రం చెన్నైలో 04 మొత్తం 8 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్ష కేంద్రాల్లో 23,500 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు ఎటువంటి సందేహాలు ఉన్నా 9032185001 నంబర్‌లో సంప్రదించాలని డీఈవో కోరారు.

మార్కెటింగ్ శాఖకు రూ.94 లక్షల ఆదాయం

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లా మార్కెటింగ్ శాఖకు మే నెల ఆదాయం కింద రూ. 94.62 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆ శాఖ ఏడీ పరమేశ్వరన్ తెలిపారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో మాట్లాడుతూ.. 2025–26 వార్షిక లక్ష్యం రూ.10.10 కోట్లు కాగా జిల్లా వ్యాప్తంగా 10 మార్కెట్ల నుంచి మే నెల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. అత్యధికంగా పుంగనూరు మార్కెట్ నుంచి రూ.3.42 లక్షల సమకూరగా అత్యల్పంగా సోమల మార్కెట్ నుంచి రూ.69 వేలు వచ్చిందన్నారు. మిగిలిన ఆదాయం చిత్తూరు, బంగారుపాలెం, నగరి కుప్పం, పెనుమూరు, రొంపిచర్ల, ఎస్ఆర్ పురం మార్కెట్ల నుంచి ఆదాయం వచ్చినట్లు చెప్పారు.

బలవంతపు బదిలీలు అన్యాయం



వైఎస్సార్‌టీఏ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డి శేఖర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : గతంలో ఎన్నడూ లేని విధంగా టీచర్లకు బలవంతపు బదిలీలు నిర్వహించడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్‌టీఏ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డి శేఖర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీచర్ల బదిలీల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం బలవంతంగా ఆప్షన్లు పెట్టిస్తోందని మండిపడ్డారు. స్కూల్ అసిస్టెంట్లకు సబ్జెక్టుల వారీగా సీనియారిటీ జాబితా విడుదల చేసి, వాటిపై అభ్యంతరాలు తెలిపే అవకాశం ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. విద్యాశాఖ ప్రకటించిన ఖాళీ పోస్టులు ఎక్కడ, ఎంత దూరం ఉన్నాయో, కేటగిరిలు చూసుకోవటానికి కూడా అవకాశం ఇవ్వకపోవడం దారుణమన్నారు. వివరాలేమి తెలియకుండానే వెబ్ ఆప్షన్లు పెట్టించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆప్షన్‌లు పెట్టడంలో ఏర్పడుతున్న సాంకేతిక సమస్యలు ఎందుకు పరిష్కరించ లేకపోతున్నారన్నారు. టీచర్ల బదిలీల సమస్యలు పరిష్కరించకుండా గంటల కొద్ది వెబెక్స్ సమీక్షలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. టీచర్లు మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రతి ప్రక్రియకు కనీసం రెండు రోజుల సయయం ఇవ్వాలన్నారు. ఎస్జీటీల ఉద్యోగోన్నతి హడావుడిగా కాకుండా తగు సమయం ఇచ్చి నిర్వహించాలని కోరారు.

రెడ్‌బుక్ తప్ప.. హామీలెక్కడ ?



కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు తప్ప.. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీను పట్టించుకోలేదు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల నుంచి మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలతో సహా దాదాపు 500 మంది ప్రముఖులను అక్రమ కేసులతో జైలుకు పంపించి వేధింపులకు గురి చేస్తోంది. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ హెలీకాప్టర్లు, ప్రత్యేక ఫ్లయిట్‌లో తిరుగుతూ విలాసవంత జీవితం గడుపుతున్నారు. కానీ సంక్షేమ పథకాలపై ఏమాత్రం దృష్టి పెట్టడంలేదు. ఉద్యోగులకు ఇచ్చిన హామీల్లో భాగంగా పీఆర్‌సీ, ఐఆర్, సీపీఎస్, మొదటి తారీఖున జీతాలు ఏమయ్యాయి. రైతులు సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధరలేక పంటలను పొలాల్లోనే వదిలేశారు. మామిడి కాయలు సైతం చెట్లకే పరిమితం చేశారు. తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ ఏమయ్యాయి.

– పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ మంత్రి

ప్రశ్నిస్తానన్న వ్యక్తి కనిపించలే..



'మహానాడు నిర్వహించిన ప్రదేశంలో బాలికపై అత్యాచారం జరిగితే మౌనంగా ఉన్నారు. ఆడ బిడ్డలకు అన్యాయం జరిగితే ప్రశ్నిస్తానన్న పవన్ కళ్యాణ్ ఎక్కడున్నారు..?' ఏడాది పాలనలో కూటమి నేతలు ప్రజల చేతికి చిప్ప తప్ప మరేమీ ఇవ్వలేదు. ప్రపంచంలో అబద్ధాలతో కూడిన పుస్తకం ఏదైనా ఉందంటే.. అది టీడీపీ మెనిఫెస్టోనే.

– ఆర్‌కె.రోజా, మాజీ మంత్రి

ప్రజల్లో తిరుగుబాటు ప్రారంభం



ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేని కూటమి ప్రభుత్వం సిగ్గులేకుండా ఏడాది పండుగ నిర్వహిస్తోంది. ప్రజల్లో ఏడాది తిరగకుండానే తిరుగుబాటు మొదలయింది. నాణ్యమైన మద్యం, తక్కువ ధరలకు అందిస్తామని ఎరగా చూపి చంద్రబాబు ఓట్లు దండుకున్నారు. ఇప్పుడు అంతా మద్యం కుంభకోణమే నడుస్తోంది. కూటమి పాలనకు తెరపడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి.

– నారాయణస్వామి, మాజీ ఉప ముఖ్యమంత్రి

ప్రజలు నిలదీసే రోజులు వస్తాయి



30 యాక్టు అమల్లో ఉందని, కేసులు పెడతామనే బెదిరింపులు, పోలీసుల హెచ్చరికలను కార్యకర్తలు లెక్కచేయలేదు. కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయాలి. హామీల నుంచి పాలకులు తప్పించుకోలేరు. ప్రజలే నిలదీసే రోజులు త్వరలో వస్తాయి. – భరత్ , ఎమ్మెల్సీ, కుప్పం

అప్పులు తీసుకురావడమే సంపద సృష్టా?



సంపద సృష్టించడమంటే ప్రతి మంగళవారం అప్పులు తీసుకురావడమేనా..? పోలీసులు 110 మందికి మాత్రమే అనుమతి ఇచ్చినా ..వేల సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చారు. గతంలో గగ్గోలు పెట్టిన పెద్దలు ఇప్పుడు అప్పులు చేయడం దేనికో ప్రజలకు చెప్పాలి. ఏడాదిలో ఒక్క హామీ అమలు చేయలేదు.

– వెంకటేగౌడ, మాజీ ఎమ్మెల్యే పలమనేరు

కక్షసాధింపులు ఆపి అభివృద్ధి చేయండి



చంద్రబాబు ఇచ్చిన హామీలు నమ్మిన ప్రజలు ఆయనకు ఓట్లేసి గద్దెనెక్కిస్తే.. ఇప్పుడు ప్రజలకు వెన్నుపోటు పొడిచారు. లోకేష్ విద్యాశాఖను వదిలేసి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తు న్నారు. జిల్లాలో మామిడి రైతులను ఆదుకోవడానికి మామిడి బోర్డును ఏర్పాటు చేయాలి.

– డా.సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే, పూతలపట్టు

హామీలు అమలు చేయకపోవడం సిగ్గుచేటు



చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధికి కూటమి ఎమ్మెల్యే ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలి. చిత్తూరు అభివృద్ధికి ఆయన సొంతంగా మేనిఫెస్టోను ప్రకటించారు. ఏడాది పూర్తి అవుతున్నా అందులో ఒకటీ అమలు కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి ఏడాది అవుతున్నా ఇంతవరకు సూపర్‌సిక్స్ అమలు కాలేదు. నిరసనలో పాల్గొనడానికి వస్తున్న నాయకులు, కార్యకర్తలను పోలీసులు వేధించారు.

– విజయానందరెడ్డి, సమన్వయకర్త చిత్తూరు నియోజకవర్గం

క్లుప్తంగా

తప్పిన లక్ష్మీ కాసులు.. చివరకు హుండీలోకి..

కాణిపాకం : కాణిపాక శ్రీవరసిద్ధి వినాయస్వామి దర్శనార్థం వచ్చిన ఓ భక్తురాలు బుధవారం ఆలయంలో లక్ష్మీకాసులు(బంగారు) పోగొట్టుకున్నారు. వివరాలు ఇలా..హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తురాలు బుధవారం స్వామి దర్శనార్థం వచ్చారు. ఈ క్రమంలో ఆమె వద్ద నుంచి రెండు లక్ష్మీ కాసులు కింద పడిపోయాయి. ఇది గమనించిన ఓ హోంగార్డు ఆ రెండు కాసులను తీసి ఓ వ్యక్తి చేతికి ఇచ్చాడు. ఆ వ్యక్తి రెండు కాసుల్లో ఒకటి హుండీలో వేసి..మరో కాసును జేబులో వేసుకున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు స్పందించిన ఆలయ అధికారులు విచారణ మొదలు పెట్టారు. సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఆ కాసుల చేతుల మార్పిడిని గుర్తించారు. చివరకు బాధితురాలికి ఆ ఒక్క కాసును అందించారు. ఆమె ఆ కాసు కూడా వద్దని...అది కూడా దేవునికే అంకితమని...హుండీలో వేసి సంతృప్తిగా వెళ్లిపోయారు. ఇక ఆ కాసులను ఆ హోంగార్డు..ఎందుకు ఆ వ్యక్తికి ఇవ్వాల్సి వచ్చిందనే విషయంపై అధికారులు ఆరా తీస్తున్నారు.

గిరిజనులకు జీవనోపాధి



గిరిజనులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ

పలమనేరు : గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ ద్వారా జిల్లాలో ఎంపికైన పలమనేరు మండలంలోని జగమర్ల పంచాయతీ దేవళంపేటలోని గిరిజనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అన్ని రకాల సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా పని చేయాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి మూర్తి సూచించారు. బుధవారం జిల్లాలోని పలు శాఖల అధికారులతో దేవళంపేటలో గ్రామ సభను నిర్వహించారు. ఇందులో జిల్లా భూగర్భ జలశాఖ డీడీ గోవర్ధన్‌రెడ్డి, మత్స్యశాఖ ఏడీ రవీంద్రారెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గుణశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ.. గిరిజనులకు సమగ్ర , స్థిరమైన అభివృద్ధి చేసేందుకు కేంద్రం ఈ గ్రామాన్ని ఎంపిక చేసిందన్నారు. ఈ గ్రామంలో మొత్తం 194 కుటుంబాలుండగా ఇందులో 110 కుటుంబాలు గిరిజనులే ఉన్నారన్నారు. గిరిజనులకు విద్య, మౌలిక సదుపాయాలు, ఉపాధితో పాటు జీవనోపాధులను కల్పిస్తామన్నారు. ఈ గ్రామంలో జరుగుతున్న అభివృద్ధిపై కలెక్టర్ ప్రతినెలా సమీక్షించనున్నట్లు తెలిపారు. మరో వైపు జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ గ్రామస్తులతో మాట్లాడుతూ.. వ్యవసాయశాఖ నుంచి ఎలాంటి సదుపాయాలు కావాలో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ, విద్య, ఐసీడీఎస్, పీఆర్, ట్రాన్స్‌కో తదితర శాఖల అధికారులతో పాటు అగ్రికల్చర్ ఏడీ శివకుమార్, ఏవో సంధ్య పాల్గొన్నారు.

రేషన్ దందా

- ఊపందుకున్న బియ్యం అక్రమ రవాణా!
- పాలసముద్రం నుంచి బంగార్ పేటకు తరలింపు
- టన్ను రూ.27 వేలకు విక్రయాలు
- రూ.లక్షలు ఆర్జిస్తున్న అక్రమార్కులు

పలమనేరు : కూటమి ప్రభుత్వ రాకతో ఇప్పటికే గంజాయి, గ్రానైట్, ఇసుక, మట్టి అక్రమ రవాణా జోరందుకుంది. ఈ నేపథ్యంలో జిల్లా నుంచి కర్ణాటకలోని బంగారుపేటకు రేషన్ బియ్యం అక్రమ రవాణా ఇప్పుడు ఊపందుకుంది. చిత్తూరు సమీపంలోని పాలసముద్రం నుంచి నిత్యం కర్ణాటకకు నాలుగు వాహనాల్లో నలభై టన్నుల బియ్యం అక్రమ రవాణా సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వాహనాలు పట్టపగలే పాలసముద్రం నుంచి చిత్తూరు, పలమనేరు మీదుగా బంగారుపేటకు ఎలాంటి తనిఖీ అధికారుల భయం లేకుండా యథేచ్ఛగా తరలిపోతున్నాయి.

గతంలో బియ్యం అక్రమ రవాణాలో ఆరితేరిన అక్రమార్కులు కూటమి నేతల అండతో మళ్లీ బియ్యం రవాణాను సాగిస్తున్నట్లు తెలుస్తోంది. పాలసముద్రానికి చెందిన ఓ కీలక వ్యక్తి ఆ ప్రాంతంలోని ఏజెంట్ల ద్వారా రేషన్ బియ్యాన్ని సేకరించి రహస్య గోదాంలో నిల్వ ఉంచుతున్నట్లు తెలిసింది. కాణిపాకం ప్రాంతానికి చెందిన ఓ యువకుడు రహస్యంగా బియ్యం స్టాకు పాయింట్ పెట్టినట్లు సమాచారం. వీరి నుంచి గంగవరం మండలం నాలుగు రోడ్లు, పలమనేరు పట్టణానికి చెందిన ముగ్గురి వాహనాల్లో నిత్యం పాలసముద్రం నుంచి సరుకును కర్ణాటకకు తరలిస్తున్నారు.

టన్నుకు రూ.4 వేలు.. నెలకు రూ.42 లక్షల ఆదాయం

పాలసముద్రంలో స్మగర్లు టన్ను బియ్యం రూ.21 వేలకు కొంటున్నారు. ఇదే బియ్యం కర్ణాటకలోని బంగారుపేటకు చేరితే అక్కడ టన్ను రూ.27 వేలకు అమ్ముతున్నారు. ఇందులో రూ.2 వేలు రవాణా ఖర్చులు పోనూ నికరంగా టన్నుకు రూ.4 వేలు మిగులుతుంది. రోజుకు నాలుగు వాహనాల్లో 40 టన్నులైతే రోజుకు రూ.1.60 లక్షల లాభం దక్కుతోంది. ఈ లెక్కన నెలకు రూ.42 లక్షల ఆదాయం వస్తుండడంతో అక్రమార్కులకు ఇదో మంచి వ్యాపారంలా మారింది. భారీ లాభాలు వస్తుండడంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, స్పెషల్ పార్టీ, ఆ మార్గంలోని పోలీసులతో పాటు సంబంధం ఉన్న పలు శాఖలకు నెల నెలా మామూళ్లు అందుతుండడంతోనే వీరి వ్యాపారం సజావుగా సాగుతోందని విమర్శలున్నాయి. ఏదేమైనా దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఎటుచూసినా బియ్యం బస్తాలే....

జిల్లాలోని నగరి, గంగాధర నెల్లూరు మండలాల్లో పలుచోట్ల తమిళ బియ్యంతో పాటు, స్థానిక రేషన్ బియ్యాన్ని డీలర్ల ద్వారా స్మగర్లు కొంటున్నట్లు తెలుస్తోంది. బుధవారం సైతం నగరి మండలంలోని కేవీఆర్‌పేట ఎంజీఆర్‌నగర్ ఈశ్వరుని ఆలయం సమీపంలో చౌక దుకాణం డీలర్లు ఐదు టన్నుల దాకా బియ్యాన్ని కర్ణాటకకు తరలించేందుకు సిద్ధంగా పెట్టినట్లు స్థానికులు గుర్తించారు. దీనిపై అదే ప్రాంతానికి చెందిన స్థానికులు డీఎస్వోకు సైతం ఫిర్యాదు చేసినా స్పందనలేదని తెలిసింది. ఇదే విధంగా పాలసముద్రం, కార్వేటినగరంతో పాటు తమిళనాడుకు ఆనుకొని ఉన్న పలు మండలాల్లో భారీగా బియ్యం అక్రమ నిల్వలున్నట్లు తెలుస్తోంది.



పాల సముద్రం నుంచి కర్ణాటకలోని బంగారుపేట్‌కు నిత్యం బియ్యం స్మగ్లింగ్ చేసే వాహనాలు



నగరి : కేవీఆర్ పేటలో డీలర్లు సేకరించిన బియ్యం బస్తాలు

స్మగ్లింగ్ కోసమే నాలుగు వాహనాలు

నాలుగు వాహనాలు కేవలం బియ్యం అక్రమ రవాణా కోసమే వాడుతున్నట్లు తెలుస్తోంది. ఈ వాహనాల వివరాలను ఆయా మార్గాల్లోని కొందరికి స్మగర్లు ముందుగానే ఇచ్చి ఈ వాహనాలను ఆపకుండా ఉండేలా మామూళ్లు ఇస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

10న జాబ్‌మేళా



జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ

తిరుపతి అర్బన్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 10న నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న జాబ్‌మేళా పోస్టర్‌ను బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ గణేష్ మాట్లాడుతూ ఈ నెల 10న ఉదయం 8 గంటల నుంచి నాయుడుపేటలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పదోతరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. ఆ మేరకు ముందుగా పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అదనపు సమాచారం కోసం 919985056929, 9154449677, 9988853335 సంప్రదించాలని తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 78,631 మంది స్వామివారిని దర్శించుకోగా, 31,247 మంది భక్తులు తలనీలాలు ఇచ్చారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.29 కోట్లు సమర్పించారు. టిక్కెట్లు లేని భక్తులకు 16 గంటల్లో దర్శనం, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

వైద్యులు బాధ్యతగా విధులు నిర్వహించాలి



సమీక్షలో పాల్గొన్న మెడికల్ ఆఫీసర్లు , వైద్యశాఖ అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పీహెచ్‌సీలలో విధులు నిర్వహిస్తున్న మెడికల్ ఆఫీసర్లు బాధ్యతగా పని చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మాతా శిశు సంరక్షణలో మెడికల్ ఆఫీసర్లు తమ పరిధిలో ఉన్న ఏఎన్ఎంలు, ఆశాలు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ఆర్‌సీహెచ్ కార్యక్రమంలో గర్భిణుల నమోదు, వారికి అందించాల్సిన సేవలు కచ్చితత్వంతో నిర్వహించాలన్నారు. గర్భిణుల వివరాలు నమోదు చేసే సమయంలో ఎలాంటి తప్పిదాలు ఉండకూడదన్నారు. హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పుట్టిన ప్రతి బిడ్డ వివరాలను రిజిస్ట్రేషన్ చేయడం వల్ల వారికి నిర్దేశించిన సమయంలో వ్యాక్సినేషన్ అందించవచ్చన్నారు. ఈ విషయంలో ఏఎన్ఎంలు అలసత్వం వహించకూడదని తెలిపారు. ఎవరైనా విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమీక్షలో డీఎంఅండ్‌హెచ్‌వో సుధారాణి, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటప్రసాద్, డీఐవో హనుమంతరావు, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

వైజాగ్‌లో సాకేవూరు డ్రైవర్ అనుమానాస్పద మృతి



మృతి చెందిన లారీ డ్రైవర్ రాజేంద్రనాయుడు

పలమనేరు : మండలంలోని సాకేవూరు గ్రామానికి చెందిన ఓ లారీ డ్రైవర్ వైజాగ్ పట్టణ సమీపంలోని నిర్మానుష ప్రాంతంలో రోడ్డు పక్కన చెట్టుకు వేలాడుతూ అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. సాకేవూరుకు చెందిన రాజేంద్ర నాయుడు కొంత కాలంగా (32) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ మధ్య లారీలో విశాఖ ప్రాంతానికి వెళ్లగా బుధవారం అక్కడ ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబికులు, స్థానికుల వాట్సాప్‌కు ఫొటోలు వచ్చాయి. అయితే మృతి చెందిన రాజేంద్రనాయుడికి గతంలో పెళ్లి జరిగిందని భార్యతో మనస్పర్ధలున్నట్లు తెలిసింది. అయితే డ్రైవర్‌గా వెళ్లిన అతను ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ఎవరైనా హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారా? అనే విషయాలు అక్కడి పోలీసులు విచారణలో వెల్లడికానున్నాయి.

దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్‌పై కక్ష

- మొగిలిలో చేతివాటం అంటూ ఫిర్యాదు
- నోటీసులు ఇవ్వకుండా విచారణ.. సస్పెన్షన్ ?
- ఇన్‌స్పెక్టర్‌పై కత్తికట్టిన కూటమి నేతలు
- సస్పెన్షన్ వెనుక అంతర్యమేమిటో..

కాణిపాకం : జిల్లా దేవదాయశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ సస్పెన్షన్ వెనుక అంతర్యమేమిటో అనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. మూడు రోజుల కిందట బంగారుపాళ్యం మండలంలోని శ్రీ మొగిలి దేవస్థాన హుండీ లెక్కింపులో చేతివాటం ప్రదర్శించారంటూ కొందరు వ్యక్తులు (కూటమి నేతలు) శనివారం దేవదాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. హుటాహుటిన మరుసటి రోజే దీనిపై ఆ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా విచారణకు పిలిచారు. అయితే అంత అత్యవసరంగా ఆదివారం విచారణ చేయాల్సిన అవసరం ఏముందని ఆ శాఖ అధికారు ఆ అధికారి తీరుపై మండిపాటుకు గురవుతున్నారు. కక్ష పూరితంగానే సుమన ప్రియను సస్పెండ్ చేయాలని కొందరు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. సాక్షులుగా ఉన్న వ్యక్తులు లెక్కించే సమయంలో సీసీ పుటేజీలో ఉన్నారా..? సీసీ పుటేజీలో సుమన ప్రియ డబ్బులు తీసుకున్నట్లు ఆధారాలున్నాయా అనే విషయాలు అధికారులు దాచి పెట్టినట్లు తెలుస్తోంది. ఒకే సామాజిక వర్గానికి, కూటమి నేతలకు అంటకాగిన కొందరు అధికారులు సుమన ప్రియపై కక్ష కట్టి సస్పెండ్‌కు పూనుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈమెను సస్పెండ్ చేసి కార్యాలయంలో పనిచేసే మరో అధికారికి ఈ సీటును కేటాయించే ప్రయత్నంలో ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు పెద్ద ఎత్తున రాజకీయాలు నడిచినట్లు విమర్శలు వస్తున్నాయి.

హుండీ లెక్కింపులో ఏం జరుగుతోంది..

గతంలో హుండీ లెక్కించాలంటే ఆ ఆలయ అధికారి ముందస్తుగానే ప్రకటన ఇవ్వాలి. స్థానికులు, అధికారులు, సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు, మీడియాకు సమాచారం ఇవ్వాలి. అయితే ఎక్కడ కానీ ఈ రకంగా హుండీ లెక్కింపు జరగడం లేదు. వాళ్ల ఇష్టానుసారంగా హుండీ లెక్కింపు చేస్తున్నారు. అడిగేవారు లేరని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అందుకే ఇలాంటి సమస్యలు జిల్లాలో తరుచూ జరుగుతున్నాయి. గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్న ఈ లెక్కింపుపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. లెక్కించే సమయంలో ఉన్న సిబ్బంది, అధికారులు, సభ్యులు, ఇతరులు ఒక్కొక్కరూ రూ.1000 నుంచి రూ. 2 వేల వరకు పంచుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో సీసీ కెమెరాలు కూడా కప్పేస్తున్నారనే విమర్శలు గుప్పుమంటున్నాయి.

ఇంటింటి చెత్త సేకరణ చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఇంటింటి చెత్త సేకరణ 100 శాతం చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో వరుస సమావేశాలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని సచివాలయ పరిధిలో చెత్త సేకరణ పై శానిటరీ ఇన్‌స్పెక్టర్ల సంతకంతో నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ముఖ్యమైన ప్రదేశాల గోడలపై పోస్టర్లను అతికించకూడదని చెప్పారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఉన్న పోస్టర్లను తొలగించాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖతో సమన్వయం చేసుకుని ఏరియా ఆసుపత్రుల్లో నమోదవుతున్న కేసుల వివరాలను పరిశీలించాలన్నారు. వ్యాధులు ప్రబలుతున్న ప్రాంతాలను గుర్తించి వెంటనే పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మరమ్మతులకు గురైన వీధి దీపాలను సరిచేయాలన్నారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, తాగునీటిని క్లోరినేషన్ చేసి ఓవర్ హెడ్ ట్యాంక్‌లను క్రమం తప్పకుండా శుభ్రం చేయించాలని ఆదేశించారు. సమావేశంలో పలువురు కమిషనర్లు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పై ప్రచారం

జిల్లాలోని ప్రజలందరికీ పీఎం సూర్యఘర్ యోజన పథకం ఉపయోగాలను తెలిసేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. రాయితీతో సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవడం పై మరింత అవగాహన కల్పించాలన్నారు. మండల, గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. సంఘాల్లో మహిళలకు స్త్రీ నిధి, ఉన్నతి, బ్యాంక్‌లతో రుణాలను అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రాన్స్ కో ఎస్ఈ ఇస్మాయిల్, నెడ్ క్యాప్ డెవలప్మెంట్ ఆఫీసర్ అబ్దుల్ గయాజ్, జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, డీఆర్డీఏ పీడీ శ్రీదేవి పాల్గొన్నారు.

విత్తన పంపిణీ ప్రారంభం

- తొలిరోజు 5220 రైతులు రిజిస్ట్రేషన్
- బ్యాగుకు కొన్నిచోట్ల రూ.1,700 వసూలు



రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లాలో వేరుశనగ విత్తన పంపిణీ రిజిస్ట్రేషన్ బుధవారం నుంచి ప్రారంభమైంది. అరకొర విత్తనాల రాకతో వ్యవసాయశాఖ అధికారులు ఎలా పంపిణీ చేయాలో తెలియక తికమకపడుతున్నారు. కూటమి నేతల ముందస్తు ఆర్డర్లతో రైతులకు ఎలా సమాధానం చెప్పుకోవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. నేను లీడర్....నేను చెప్పిన వాళ్లకే కాయలు ఇవ్వాలని ప్రతి పంచాయతీ నుంచి పది నుంచి ఇరవై మంది అధికారులను వేధిస్తున్నారు. పొలం లేకున్నా విత్తనం ఇవ్వాల్సిందేనని పట్టుబడుతున్నారు. దీంతో మండల అధికారులు, సిబ్బంది వణికిపోతున్నారు. తొలి రోజు ప్రక్రియ నత్తనడకన సాగింది. మరోవైపు ఎమ్మెల్యేల నుంచి ముహూర్తం ఖరారు కాకపోవడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అడ్డంకులు పడ్డాయి. ఎమ్మెల్యేల ప్రారంభోత్సవం తర్వాతే విత్తన కాయల రిజిస్ట్రేషన్ ప్రారంభించాలని చాలా చోట్ల మెలిక పెట్టారు. ఇక కొన్ని మండలాల్లో ఆ అరకొర కాయలు వద్దని, ఇస్తే గొడవలు వస్తాయని నిలుపుదల చేశారు. దీంతో విత్తన పంపిణీ ప్రక్రియ గురువారం కూడా జోరుగా సాగేటట్లు కనిపించడం లేదు. కొన్ని చోట్ల మాత్రం లోలోపల రిజిస్ట్రేషన్లు జరిగిపోతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. వేరుశనగ విత్తన బ్యాగు (కే–6రకం..30 కేజీలు) రూ.1674 కాగా..కొన్ని చోట్ల రూ.1700 వసూలు చేస్తున్నారని రైతులు అంటున్నారు. చిల్లర పేరుతో ఇలా దోపిడీ చేయడం సరికాదని పలువురు మండిపడుతున్నారు. కాగా 1881 క్వింటాళ్లకు...5220 మంది రైతులు రిజిస్ట్రేషన్ అయ్యారని అధికారులు చెబుతున్నారు.

చిన్నారి డిశ్చార్జ్

తిరుపతి తుడా: కోవిడ్ బారిన పడిన పది నెలల చిన్నారి బుధవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. ఏర్పేడు మండలం పాపానాయుడుపేటకు చెందిన 10 నెలల చిన్నారికి కోవిడ్ పాజిటివ్‌గా తేలడంతో రుయా చిన్నపిల్లల ఆస్పత్రిలో చికిత్స అందించారు. చిన్నారి ఆరోగ్యం కుదుట పడడం, కరోనా లక్షణాలు స్వల్పంగా ఉండడంతో కుటుంబ సభ్యులు హోమ్ ఐసోలేషన్‌లో ఉంటామని చెప్పడంతో వైద్యులు తగిన సూచనలు చేసి డిశ్చార్జ్ చేశారు. గడిచిన నెల రోజుల్లో ఇప్పటివరకు జిల్లాలో మొత్తం నాలుగు కోవిడ్ కేసులు నమోదయ్యాయి. స్విమ్స్, రుయా కోవిడ్ కేంద్రాల్లో నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా రెండేసి చొప్పున మొత్తం నాలుగు కేసులు నమోదు అయ్యాయి. కోవిడ్ లక్షణాలు స్వల్పంగా ఉండడంతో చిన్నారి మినహా మిగిలిన ముగ్గురు హోమ్ ఐసోలేషన్‌లోనే చికిత్స తీసుకున్నారు.

ఎన్ఎస్‌యూలో ప్రవేశాలకు రేపటితో గడువు ముగింపు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలో యూజీ, పీజీ, పాక్‌శాస్త్రి (ఇంటర్) కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ గడువు శుక్రవారంతో ముగియనున్నట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా గానీ, వర్సిటీలో ఏర్పాటు చేసి ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జాతీయ స్థాయి ఎంట్రన్స్ పరీక్ష ఎన్‌యూఈటీతో సంబంధం లేకుండా డైరెక్ట్ అడ్మిషన్ల కోసం శాస్త్రి, ఆచార్యా కోర్సులకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు పాక్‌శాస్త్రీ (ఇంటర్మీడియట్) కోర్సులో చేరేందుకు ఈనెల 6లోపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

జీప్ స్వాధీనం

తిరుపతి క్రైమ్ : గోవిందరాజ స్వామి సమీపంలోని పద్మావతి స్టాండ్‌లో జీప్ చోరీ కేసును ఈస్ట్ పోలీసులు ఛేదించారు. ఈ నెల రెండో తేదీన గుర్తుతెలియని వ్యక్తులు కోనేరు కట్ట మీద సమీపంలో ఉన్న రామచంద్రారెడ్డి జీపును చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేయగా.. బుధవారం సాయంత్రం గోవిందరాజస్వామి సత్రాల వద్ద జీపును గుర్తించారు. అందులో ఉన్న దొంగ అయిన ఒడిశాకు చెందిన లింగం రాజిరెడ్డిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి జీపు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

పకడ్బందీగా బదిలీలు

– పర్యవేక్షించిన ఆర్జేడీ శామ్యూల్



బదిలీల సమస్యలను ఆర్జేడీ దృష్టికి తీసుకెళ్తున్న ఎస్టీయూ, యూటీఎఫ్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఆర్జేడీ శామ్యూల్ అన్నారు. బుధవారం ఆయన ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న బదిలీల కసరత్తును పర్యవేక్షించారు. అనంతరం విలేకరులకు పలు అంశాలు వెల్లడించారు. ఆర్జేడీ మాట్లాడుతూ.. టీచర్ల సమస్యల పరిష్కారానికి తిరుపతి డీఈవో కేవీఎస్ కుమార్ ఆధ్వర్యంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి తప్పిదాలు చోటు చేసుకోకుండా కసరత్తును నిర్వహిస్తున్నారని చెప్పారు.

సమస్యలు ఇవీ

బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియలో సిద్ధం చేసిన సీనియారిటీ జాబితాల్లో పేర్లు లేకపోవడం, అభ్యర్థన బదిలీలను కచ్చితమైన బదిలీలుగా చూపించడం, ఉద్యోగోన్నతి పొందిన గ్రేడ్–2 హెచ్ఎం, ప్రైమరీ స్కూల్ హెచ్ఎంలుగా మార్పు తీసుకున్న వారి ఖాళీలను వెబ్‌సైట్‌లో చూపకపోవడం, క్లస్టర్ పాఠశాలలను ఎవరు ఎంపిక చేసుకోవాలనే దానిపై స్పష్టత లేకపోవడం, ప్రాధాన్యత కేటగిరీలో రెండు పోస్టులుంటే ఒకటి తప్పనిసరి అనేది అన్ని మండలాల్లో చూపకపోవడం వంటి అవకతవకలు ఉన్నాయి. ఇటువంటి సమస్యలపై వందకు పైగా టీచర్ల నుంచి ఫిర్యాదులు అందాయి. బదిలీల కసరత్తులో చోటు చేసుకున్న అవకతవకలను సరిదిద్ది వెబ్ ఆప్షన్‌ల నమోదుకు గడువు పెంచాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

తప్పిదాలు సరిదిద్దాలి

ఈనెల 3వ తేదీన విడుదలైన స్కూల్ అసిస్టెంట్ల సీనియారిటీ జాబితాలో దొర్లిన పొరపాట్లను సవరించుకునేందుకు పెద్ద సంఖ్యలో టీచర్లు క్యూ కట్టారని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్ అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. ఆర్జేడీ దృష్టికి టీచర్ల సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వెబ్ ఆప్షన్లకు తక్కువ గడువు ఉన్న విషయాన్ని వివరించారు. డీఎస్సీ 2008 టీచర్లకు కామన్ జాయినింగ్ తేదీ ఉండే విధంగా చూడాలన్నారు. ప్రిఫరెన్షియల్ క్యాటగిరీల వారికి ఖాళీల కేటాయింపులో నిబంధనలు పాటించాలన్నారు. వెబ్ ఆప్షన్లు పెట్టుకునేందుకు రేపటి వరకు గడువు పొడిగించాలన్నారు. క్లస్టర్ రిసోర్స్ టీచర్ పోస్టుల విధి విధానాలను తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు మదన్‌మోహన్ రెడ్డి, నాయకులు చంద్రన్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.